# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-10-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **ఈ నెల 22, 23 తేదీలలో జరగనున్న అంతర్జాతీయ డ్రోన్ సదస్సుకు ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి.**

**2.** **ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో డ్రోన్ సదస్సు నూతనాధ్యాయం సృష్టిస్తుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు అన్నారు.**

**3.** **విజయవాడ వద్ద కృష్ణా నదికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది.**

**4.** **రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం నాణ్యమైన వైద్య సేవలను అందిస్తోందని వైద్య ..., ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు.**

**5.** **తూర్పు మధ్య బంగాళాఖాతంలో రేపు అల్పపీడన ఏర్పడే అవకాశం ఉంది.**

**6.** **ఈ రోజు ప్రపంచ గణాంకాల దినోత్సవం నిర్వహిస్తున్నారు.**

==========================

వివిధ రంగాలలో డ్రోన్ సేవలను గణనీయంగా వినియోగించుకునే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 22, 23 తేదీలలో గుంటూరు జిల్లా మంగళగిరిలో జరగనున్న అంతర్జాతీయ డ్రోన్ సదస్సు ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. ఈ సదస్సు ద్వారా డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానం పట్ల ప్రజలలో విస్తృత స్థాయిలో అవగాహన పెంపొందించి ప్రజలకు అన్ని రకాల సేవలు శీఘ్రంగా అందించాలన్నాది ప్రభుత్వ లక్ష్యం. అంతే కాకుండా డ్రోన్ వినియోగం వల్ల రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు సమకూరడమే కాకుండా యువతకు ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయి.

డ్రోన్ సదస్సులో భాగంగా ఈ నెల 22 వ తేదీ సాయంత్రం విజయవాడ కృష్ణా నది ఒడ్డున పున్నమి ఘాట్ బబ్బూరి మైదానంలో కన్నుల పండువగా డ్రోన్ ప్రదర్శనా కార్యక్రమం జరగనున్నది. దేశంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అయిదు వేలకు పైగా డ్రోన్లతో భారీ ప్రదర్శన నిర్వహించనున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు కళ్ళు మిరుమిట్లు గొలిపే లెజర్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నది. ఈ కార్యక్రమ ఏర్పాట్లను ఎన్.టి.ఆర్. జిల్లా ఇన్ చార్జి కలెక్టర్ నిది మినా పరిశీలించారు. ఇందుకు సంబంధించిన అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి డ్రోన్ ప్రదర్శనను విజయవంతం చేయాలని సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో అంతర్జాతీయ డ్రోన్ సదస్సు నూతన అధ్యాయం సృష్టిస్తుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు అన్నారు. ఈ నెల 22 ..., తేదీలలో జరగనున్న డ్రోన్ సదస్సులో పాల్గొనాలని తాను ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నానని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనిక నాయకత్వంలో ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధి సాధనలో కొత్త పుంతలు తొక్కుతోందని ....నవ కల్పనల రంగంలో ఆంధ్ర ప్రదేశ్ ముందంజలో ఉండాలని ...భవిష్యత్తుకు కొత్త కొలమానాలను నిర్దేశించాలని ఆశిస్తున్నానని రామ్మోహన్ నాయుడు అన్నారు.

---------------------------

ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని చలన చిత్ర నటుడు సుధీర్ బాబు పిలుపునిచ్చారు. ఆదాయం పన్ను శాఖ ..... పత్రికా సమాచార కార్యాలయం ఆధ్వర్యంలో విజయవాడలో ఈ రోజు జరిగిన స్వచ్ఛత హి సేవా వాక్తాన్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ప్రతి విద్యార్థి స్వచ్ఛత హి సేవా స్ఫూర్తిని కొనసాగించాలని సుధీర్ బాబు సూచిస్తూ ........,

..వాయిస్... 15 సెకన్లు....

ఈ కార్యక్రమంలో ఆదాయం పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ సునీత బిళ్ళ ...., పత్రికా సమాచార కార్యాలయం అదనపు డైరెక్టర్ జనరల్ రాజేంద్ర చౌదరి పాల్గొన్నారు.

సునీతా బిళ్ళ మాట్లాడుతూ ....పరిసరాల పరిశుభ్రతపై సామాజిక స్పృహ కలిగి ఉండాలని సూచించారు.....

..వాయిస్... 15 సెకన్లు....

రాజేంద్ర చౌదరి మాట్లాడుతూ ....పరిశుభ్రతను సమష్టి జీవన విధానంగా మార్చుకునేలా అందరూ ముందడుగు వేయాలని సూచించారు.........

..వాయిస్... 15 సెకన్లు...

---------------------------

....విజయనగర జిల్లా గుర్ల గ్రామంలో అతిసార వ్యాధి పరిస్థితి అదుపులోకి వస్తోంది. ఈ వ్యాధికి గురై వారం రోజుల వ్యవధిలో గుర్ల గ్రామంలో ఏడుగురు ....కోటగండ్రేడులో ఒకరు మరణించారు.తల్లిని కోల్పోయిన మనోవేదనతో మరొకరు ....., ఇతర సమస్యలతో మరొక ఇరువురు మృతి చెందారు. ఈ అంశంపై ఆకాశవాణి విజయనగరం ప్రతినిధి ఎన్. రామకృష్ణ మరిన్ని వివరాలు అందజేస్తారు.

...వాయిస్ ... 35 సెకన్లు....

---------------------------

రాష్ట్రంలో ప్రజారోగ్య వ్యవస్థ సక్రమంగా పని చేయడం లేదని వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ...., మాజీ ముఖ్య మంత్రి వై.ఎస్. జగన్ మోహన రెడ్డి విమర్శించారు. విజయనగరం జిల్లా గుర్లలో ప్రబలిన అతిసార వ్యాధి ఘటనలే ఇందుకు ఉదాహరణ అని ట్విట్టర్ మాధ్యమంలో ఆయన పేర్కొన్నారు. అతిసార వ్యాధి ప్రబలి

పలువురు మృత్యువాత పడినప్పటికీ ... రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యపై దృష్టి సారించక పోవడం విచారకరమని ...., విజయనగరం .. విశాఖపట్నం లలో మంచి ఆస్పత్రులు ఉన్నప్పటికీ .....బాధితులకు ప్రభుత్వం స్థానిక పాఠశాలలోనే చికిత్స అందిస్తోందని .....ఇప్పటికైనా ఈ అంశంపై ప్రభుత్వం దృష్టి సారించాలని జగన్ మోహన రెడ్డి కోరారు.

---------------------------

రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం నాణ్యమైన వైద్య సేవలను .....విద్యార్థులకు ఉత్తమ మైన వైద్య విద్యను అందిస్తోందని వైద్య ..., ఆరోగ్య శాఖల మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు.

రాష్ట్రంలో వైద్య వ్యవస్థ సక్రమంగా పని చేయడం లేదని మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన రెడ్డి చేసిన విమర్శకు ఆయన ఈ రోజు ట్విట్టర్ మాధ్యమంలో స్పందిస్తూ ....గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం సరిదిద్దుతోందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలోనే ఆరోగ్య వ్యవస్థ కుప్పకూలిందని .... రాష్ట్ర ప్రజలు.కనీస వైద్య సదుపాయాలు అందక ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. రాష్ట్రంలో కొత్త వైద్య కళాశాలలల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ గత ప్రభుత్వం ఆ నిధులను సక్రమంగా వినియోగించలేదని సత్య కుమార్ యాదవ్ విమర్శించారు.

---------------------------

విజయవాడ వద్ద కృష్ణానదికి ఎగువ ప్రాంతం నుండి భారీగా వరద ప్రవాహం వస్తోంది. దీనితో నీటి పారుదల శాఖ అధికారులు ప్రకాశం బ్యారేజ్ 70 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతం నుండి భారీగా వరద నీరు వస్తుండడంతో కృష్ణా నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ యంత్రాంగం హెచ్చరికలు జారీ చేసింది.

---------------------------

మధ్య అండమాన్ సముద్రం పరిసరాలలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఈ నెల 21 లేదా 22 తేదీలలో తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈ అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశగా పయనించి 23వ తేదీ నాటికి వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని పేర్కొంది. ఈ వాతావరణ సూచన దృష్ట్యా రేపటి నుండి మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. ఈ నెల 24 వ తేదీ నుండి రెండు రోజుల పాటు ఉత్తర కోస్తాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

మరొక వైపు .... ఉత్తర తమిళనాడుకు ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో నిన్న ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో కోస్తాంధ్ర ...., రాయలసీమ జిల్లాలలో అనేక చోట్ల ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి.

---------------------------

అధికారిక గణాంకాల ప్రాథమిక సూత్రాల ప్రాముఖ్యత పట్ల ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈ రోజు ప్రపంచ గణాంకాల దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఐక్య రాజ్య సమితి స్టాటిస్టికల్ కమిషన్ పిలుపు మేరకు

ప్రతి ఏటా అక్టోబర్ 20 వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. మొదటిసారిగా 2010 వ సంవత్సరంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయితే .... పశ్చిమ బెంగాల్ కు చెందిన ప్రముఖ గణాంక శాస్త్రవేత్త ప్రశాంత చంద్ర మహాలనోబిస్ జయంతినీ పురస్కరించుకుని భారత దేశంలో మాత్రం ప్రతి ఏటా జూన్ 29 వ తేదీన జాతీయ గణాంక దినోత్సవం నిర్వహిస్తున్నారు.

======================